సాక్షి
కాకినాడ

ఆదివారం। 10। సెప్టెంబర్। 2023

I



రూ.లక్ష విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కలిదిండి గ్రామానికి చెందిన కృష్ణచైతన్య, మాధురి, దీపక్ శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



ఆక్వా సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం

మత్స్య సంపద సృష్టిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో వీటి వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. - IIలో

కడలిలోకి 4.24 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,24,387 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.90, భద్రాచలం వద్ద 28.80 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

పంపా తీరం.. భక్త జన సంద్రం

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన పెళ్లి బృందాలు, భక్తులతో రత్నగిరిపై కొలువైన సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. పంపా నదీ తీరం భక్తులతో నిండిపోయింది. శనివారం దశమి పర్వదినానికి తోడు రెండో శనివారం సెలవు కావడంతో భారీగా భక్తులు తరలి వచ్చారు. దీనికి తోడు శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో సుమారు 50 వివాహాలు జరిగాయి. ఇక్కడ వివాహాలు చేసుకున్న దంపతులు, వారి బంధుమిత్రులతో బాటు ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధువులు కూడా సత్యదేవుని దర్శనానికి, వ్రతాలు ఆచరించేందుకు తరలి వచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామి వారిని శనివారం సుమారు 40 వేల మంది భక్తులు దర్శించారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దేవస్థానంలోని పలు విభాగాల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఏకాదశి, సెలవు దినం అయినందున ఆదివారం కూడా రత్నగిరిపై భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది.

ప్రత్తిపాడు తహసీల్దార్ సస్పెన్షన్

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణను చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) సస్పెండ్ చేశారు. ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామంలో సుమారు 25 ఎకరాల భూమిపై సుదీర్ఘ కాలంగా వివాదం జరుగుతోంది. ఈ భూమి శరభవరం గ్రామానికి చెందిన కూసుమంచి సీతయమ్మకు చెందినట్టుగా రికార్డుల్లో ఉంది. అయితే, పెద్దిపాలెం గ్రామానికి చెందిన చింతాకుల భాస్కరరావు కుటుంబీకులు సుమారు 40 ఏళ్లుగా సాగు చేస్తున్నారు. ఈ భూమికి తాము హక్కుదారులమంటూ ఇరు వర్గీయులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. అయితే ఈ భూమిలో 10 ఎకరాలను సత్తి వినోద్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి సీతయమ్మ విక్రయించింది. వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ వినోద్ కుమార్ రెడ్డికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడంతో చింతాకుల భాస్కరరావు కుటుంబీకులు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సీసీఎల్‌ఏ.. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు ధ్రువీకరించారు. ఏలేశ్వరం తహసీల్దార్ చిన్నారావును ప్రత్తిపాడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారని ఆర్డీఓ తెలిపారు.

కేపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వర్ధమాన క్రికెటర్లు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు కాకినాడ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) పోటీలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు టి.హరీష్ అన్నారు. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కొడితే కొట్టాలిరా' అనే నినాదంతో కేపీఎల్ క్రికెట్ పోటీలు జిల్లా క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమయ్యాయి. ముందుగా దివంగత డాక్టర్ కె.స్వర్ణరాజుకు నివాళిగా క్రీడాకారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గౌరవ అతిథి, క్రికెట్ సంఘ మాజీ కార్యదర్శి కె.బాపిరాజు మాట్లాడుతూ దివంగత స్వర్ణరాజు క్రికెట్ ఆటగాళ్లకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించేవారన్నారు. ఆయనను కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. క్రికెట్‌లో మెరుగ్గా రాణించే వారికి ఇప్పుడు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ పోటీల్లో కాకినాడ జిల్లా పరిధిలోని 19 మండలాల నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.8 వేల చొప్పున నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. అలాగే మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారితో రెండో లీగ్ నిర్వహించి విజేత జట్టుకు రూ.2 లక్షలు, రన్నర్స్ జట్టుకు రూ.1 లక్ష నగదు బహుమతులను సానా సతీష్‌బాబు చేతుల మీదుగా అందిస్తామని వివరించారు. అనంతరం ముఖ్య అతిథి హరీష్ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ చార్లీ, ఫౌండేషన్ ప్రతినిధి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అయితే తప్పేంటి?

- చంద్రబాబు అరెస్టును పట్టించుకోని జనం
- టీడీపీ ఆందోళనలకు స్పందన నిల్
- బెడిసికొట్టిన సెంటిమెంట్ ప్లాన్
- ముఖం చాటేసిన తెలుగు తమ్ముళ్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తెలుగు తమ్ముళ్ల ఆశలు ఆవిరైపోయాయి. అవినీతిపై పక్కా ఆధారాలతో అడ్డంగా చంద్రబాబు దొరికిపోయిన తర్వాత కూడా.. ఆయన అరెస్టుపై సెంటిమెంట్‌తో రాజకీయంగా లబ్ధి పొందాలనే టీడీపీ వ్యూహం బెడిసికొట్టింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబును సీఐడీ అరెస్టు చేయడాన్ని మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు స్వాగతించారు. అవినీతికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏజెన్సీల నివేదికలపై చంద్రబాబును అరెస్టు చేయడంలో తప్పు పట్టడానికి ఏముందంటూ మేధావి వర్గం విశ్లేషిస్తోంది. ఇలా అరెస్టు చేశారో లేదో అలా ప్రజలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చి సంఘీభావం తెలియజేస్తారని తెలుగు తమ్ముళ్లు అంచనాలు వేసుకున్నారు. కానీ అందుకు భిన్నంగా ప్రజల నుంచి కనీస స్పందన, సానుభూతి కూడా కనిపించ లేదు. పార్టీ నేతలు, శ్రేణుల్లో వ్యక్తమయ్యే నిరసనలను సానుభూతిగా మలచుకోవాలనుకున్న జిల్లాలో ఆ పార్టీ ముఖ్య నేతలు వేసుకున్న అంచనాలు తల్లకిందులయ్యాయి. స్కిల్ కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు చేసి, నిజాలు నిగ్గు తేల్చాకనే అన్ని ఆధారాలతో బాబును అరెస్టు చేస్తే అది అక్రమమని, రాజకీయ కక్ష సాధింపు చర్య అని టీడీపీ నేతలు విమర్శించడాన్ని విజ్ఞులు, ప్రజలు తప్పు పడుతున్నారు.

బంద్‌కు స్పందనే లేదు

ఉదయం చంద్రబాబు అరెస్టు జరిగిన వెంటనే అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లాలో టీడీపీ పార్టీ నేతలు నిరసనలు, బంద్‌లకు పిలుపునిచ్చారు. అవినీతికి పాల్పడినట్టు పక్కా ఆధారాలు పోలీసుల వద్ద ఉండటంతో ప్రజల నుంచి స్పందన లభించదనే ఆలోచనతోనే జిల్లాలో ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు స్వచ్ఛంద అరెస్టులకు సిద్ధపడ్డారని వివిధ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పుంగనూరు తరహాలోనే అలజడులు సృష్టించాలనే వ్యూహం జిల్లాలో బెడిసికొట్టింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆర్టీసీ బస్సులను ఉదయం కాకినాడ, గోకవరం, ఏలేశ్వరం, తుని డిపోల్లోనే నిలిపివేశారు. మధ్యాహ్నం నుంచి బస్సులు యథాతథంగా నడిచాయి. పెద్దాపురంలో టీడీపీ నేతలు రోడ్డుపై బైఠాయించి ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని చెదరగొట్టి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు. చిన్న దానికే హడావుడి, ఆర్భాటం చేసే మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌వీఎస్ఎన్ వర్మ, వనమాడి కొండబాబు సహా పలువురు నేతలు చంద్రబాబు అరెస్టు ఎపిసోడ్‌లో ముందస్తుగానే అరెస్టులు కావడం ద్వారా ఆందోళనలకు ముఖం చాటేశారని చెబుతున్నారు. జిల్లా కేంద్రం కాకినాడ సహా తుని, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం తదితర పట్టణాల్లో ప్రజల నుంచి ఏమాత్రం స్పందన లభించ లేదు. ఈ క్రమంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి, తమను గౌరవంగా బయట పడేశారని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, తెలుగు తమ్ముళ్ల మధ్య చర్చ నడుస్తోంది. కాకినాడ, జగ్గంపేట, పిఠాపురం, తుని తదితర నియోజకవర్గాల టీడీపీ బాధ్యులు, నేతలు కనీస ప్రతిఘటన కూడా లేకుండానే అరెస్టు అవ్వడాన్ని ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోందని అంటున్నారు. టీడీపీ నేతలు సామాజిక మాధ్యమాల ద్వారా చంద్రబాబు అరెస్టులను ఖండించడంతోనే సరిపెట్టుకున్నారు.



నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



◆ అధికారం చేతిలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రభుత్వ సొమ్ము రూ.371 కోట్లు అవినీతి చేశారు. ఇప్పుడు తానేం చేయలేదు, చాలా అమాయకుడినంటూ నవరస నటనా ప్రావీణ్యం ప్రదర్శిస్తున్నారు.

– చిర్ల జగ్గిరెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, కొత్తపేట



◆ ప్రజాస్వామ్యంలో పాలకులు నీతి, నిజాయితీతో కూడిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజారంజకంగా నిర్వహించాలి. అంతే కానీ అవినీతి, లంచగొండితనం, దోపిడీకి తావుండకూడదు. వాటికి పాల్పడితే శిక్షార్హులు అవుతారు. చట్టం, న్యాయం అందరికీ సమానమే. తమ లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజలను రెచ్చగొట్టడం మంచిది కాదు. అమాయకులు బలై పోతారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– అప్పారి జయప్రకాష్, విశ్రాంత ప్రిన్సిపాల్, డైట్, బొమ్మూరు

భారీ బందోబస్తు

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ ఎదురు కాకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అన్ని ముందస్తు జాగ్రత్తలూ తీసుకున్నారు. జిల్లా నలుమూలలా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా చిన్న సంఘటనకు కూడా తావు లేకుండా పోలీసులు తీసుకున్న చర్యలు సత్ఫలితాన్నిచ్చాయి.



◆ **పాపం పండి అవినీతి సమ్రాట్ చంద్రబాబు అరెస్టు అయ్యారు. ఆయనతో సహా చట్టానికి ఎవరూ అతీతులు** కారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న చంద్రబాబు బండారం ఆధారాలతో సహా బయట పడటం వల్లనే సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఇది చట్ట పరిధిలో జరిగింది. ఆయన ఏ తప్పూ చేయకపోతే చట్టం ముందు తన నిర్దోషిత్వం నిరూపించుకోవాలి. కక్ష సాధింపు అంటూ రాజకీయ విమర్శలు చేయడం మంచిది కాదు. రానున్న రోజుల్లో ఆయన అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చి, రాజకీయంగా సమాధి కావడం తథ్యం.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి



◆ **చంద్రబాబు పాలన**ంతా **స్కాములమయమే. ఓటుకు రూ.కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి, స్టే తెచ్చుకుని వ్యవస్థలను మేనేజ్ చే**శారు. అమరావతి రాజధాని నిర్మాణంలో వేలాది ఎకరాల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నారాయణలపై కేసు నమోదైంది. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్ల ప్రజాధనం చేతులు మారాయి. దీనికి సంబంధించిన ఫైలును ఎందుకు మాయం చేశారో చంద్రబాబు సమాధానం చెప్పాలి.

– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ



◆ చంద్రబాబు అవినీతి బండారం గతంలోనే వెలుగు చూసినా, అధికారం అండతో బయటకు రానివ్వలేదు. పూర్తి ఆధారాలు లభించడంతోనే చంద్రబాబును అరెస్టు చేశారు. ఆయన అరెస్టు సక్రమమే.

– దవులూరి దొరబాబు, చైర్మన్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, పెద్దాపురం



◆ నిప్పు అని చెప్పుకునే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టు కావడంతో తాను తీసుకున్న గోతిలో తానే పడినట్టయ్యింది. పాపాలు పండి ఇప్పుడు దొరికిపోయాడు. ఇన్ని స్కాముల్లో ఉన్న చంద్రబాబు గురించి ఎప్పుడూ నోరు విప్పని పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఆయన అరెస్టు అన్యాయమంటూ వంత పాడటం చూస్తుంటే వారి మధ్య ఉన్న ప్యాకేజీ మిత్రుత్వం మరోసారి బయట పడింది. చంద్రబాబు అవినీతి సొమ్ముల నుంచి పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ ముట్టి ఉంటే భవిష్యత్తులో ఆయన కూడా సీఐడీ విచారణ ఎదుర్కోక తప్పదేమో!

– జిన్నూరి రామారావు (బాబీ), ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు



◆ 2014లో అధికారం చేపట్టిన రెండు నెలలకే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు తెర తీశారు. ప్రజల సొమ్మును కాజేసిన చంద్రబాబు నీతికబుర్లు చెప్పడం దారుణం. ఆయన అరెస్టు పూర్తిగా సమంజసమే.

– పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే, ప్రత్తిపాడు

పాత్రధారులను అరెస్టు చేస్తే.. సూత్రధారిని చేయరా!

- చంద్రబాబు అరెస్టులో రాజకీయ కక్ష సాధింపు లేదు
- దర్యాప్తులో భాగంగా చోటు చేసుకున్న పరిణామమే..
- 2017లోనే ఈడీ, జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో పాత్రధారులు ఇప్పటికే అరెస్టయ్యారని, మరి సూత్రధారిని అరెస్టు చేయరా అని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆయన కాకినాడలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాధనం రూ.371 కోట్లు పక్కదారి పట్టినట్టు తేలడంతో చంద్రబాబును అరెస్టు చేస్తే.. అదేదో తప్పుగా, రాజకీయ కక్ష సాధింపుగా.. రాష్ట్రంలో పెద్ద అరాచకం జరుగుతున్నట్టు టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా చూపుతున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ మూలాలు 2017లోనే బయట పడ్డాయన్నారు. 2014లో గజదొంగల ముఠాలా ఏర్పడిన చంద్రబాబు అండ్ కో అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే స్కిల్ స్కామ్‌కు తెర తీశారన్నారు. సుమారు రూ.3,556 కోట్లతో సీమెన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టు.. ఆ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్ 90 శాతం ఇస్తానన్నట్టు.. మిగతా 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని పేర్కొన్నారని వివరించారు. సీమెన్స్ అండ్ డిజైన్ టెక్ కంపెనీ ఇచ్చిన అంచనానే ప్రాజెక్టు వ్యయంగా తీసుకుని ఒప్పందం ఖరారు చేశారన్నారు. క్యాబినెట్‌లో పెట్టిన ఒప్పందం వేరు.. తరువాత వచ్చేసరికి సినిమా మారిపోయిందని చెప్పారు. కనీసం థర్డ్ పార్టీని సంప్రదించి అన్ని కోణాల్లోనూ చూడాలని, కానీ అవేమీ లేకుండానే చెల్లింపులు జరిగిపోయాయని అన్నారు. డిజైన్ టెక్ అనే కంపెనీ, సంబంధం లేని అనుబంధ కంపెనీలకు ఐదు దఫాలుగా రూ.371 కోట్లు విడుదల చేశారన్నారు. ఇందుకు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన రిటైర్డ్ అధికారి గంటా సుబ్బారావు పదే పదే లేఖలు రాశారన్నారు. సీమెన్స్ సంస్థకు సోమయాద్రి శేఖర్ బోస్ అనే వ్యక్తి భారతదేశానికి సంబంధించి ఎండీగా ఉండి, సుమన్ బోస్‌గా సంతకంగా పెట్టించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.371 కోట్లలో డిజైన్ టెక్, ఈపీఎస్సీ స్కిల్లర్ ఏపీ అనే రెండు షెల్ కంపెనీలకు రూ.238 కోట్లు తరలించారన్నారు. ఉత్తర ప్రత్యుత్తరాల్లో కోడ్ భాషగా హైదరాబాద్‌కు రెండు టిక్కెట్లు వెళ్లాయని రాసుకున్నారన్నారు. అప్పట్లో డిజైన్ టెక్ అనే కంపెనీ పెద్ద ఎత్తున పనులు ఎగ్గొడుతోందంటూ ఏసీబీకి సమాచారం వెళ్లిందని, దీనిపై విచారణ చేయగా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న కురసాల కన్నబాబు. చిత్రంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ

జీఎస్టీ విచారణతో..

డబ్బులు అందుకున్న రెండు కంపెనీలు అత్యాశతో జీఎస్టీ వెనక్కి ఇవ్వాలని కోరడంతో అప్పట్లో అనుమానం వచ్చిన కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేసిందని కన్నబాబు చెప్పారు. అప్పట్లో ఆయా కంపెనీల్లో సోదాలు జరగగా హవాలా రూపంలో డబ్బులు తరలించినట్టు గుర్తించారన్నారు. ఇదంతా చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2017లో జరిగిందన్నారు. డిజైన్ టెక్, శేఖర్ బోస్ మధ్య జరిగిన ఈ–మెయిల్స్‌ను డిలీట్ చేయడంతో సీమెన్స్ రిట్రీవ్ చేసి, పరిశీలించడంతో శేఖర్ బోస్ దొరికేసి, రాజీనామా చేశాడన్నారు. దీంతో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థతో తమకు సంబంధం లేదని సీమెన్స్ తెలిపిందన్నారు. ఈడీ, జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చెప్పినా ఉద్దేశపూర్వకంగానే అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తరువాత కంటితుడుపుగా దీనిపై ఇంట్రెల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైనింగ్‌తో విచారణ జరిపించారని, ఆ సంస్థ ఈ కుంభకోణాన్ని పరిశీలించి బిత్తరపోయిందని తెలిపారు. స్కిల్ స్కామ్‌లో నిందితులుగా ఉన్న సోమయాద్రి శేఖర్‌బోస్, వికాస్ వినయ్ కన్విల్కర్, ముకుల్ చంద్ అగర్వాల్ తదితరులను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే అరెస్టు చేసిందన్నారు.

కుంభకోణం బయటపెడితే కక్ష సాధింపా!

రాజకీయ కక్ష సాధింపు అని ఒకాయన, చంద్రబాబు సత్యహరిశ్చంద్రుడు అన్నట్టు మరొకరు మాట్లాడుతున్నారని కన్నబాబు ఎద్దేవా చేశారు. చంద్రబాబును అరెస్టు చేయడం దుర్మార్గమన్నట్టు వారి వందిమాగధులు, భజన బృందాలు, తోక పార్టీలు, ఎల్లో మీడియా తెగ బాధ పడుతున్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ట్వీట్‌లతో చాలా బాధ పడుతున్నారని, చంద్రబాబు అరెస్టుపై బీజేపీ అధ్యక్షురాలిగా కంటే వదినగానే ఆమె ఎక్కువ పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. పవన్ కల్యాణ్, రేవంత్‌రెడ్డి ట్వీట్లు చేశారని, దీనినిబట్టి చంద్రబాబు మూలాలు ఎక్కడ ఉంటాయో అర్థమవుతుందని చెప్పారు. చంద్రబాబు దోపిడీ చేసి, అడ్డంగా దొరికిపోతే దానిపై స్పందించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ దర్యాప్తుతో కుంభకోణం మూలాలు పట్టుకుంటే రాజకీయ కక్ష సాధింపులంటున్నారని మండిపడ్డారు.

స్కాముల కథ కంచికి చేరడంతోనే..

నాలుగు రోజులుగా తాను నిప్పని, అరెస్టు చేస్తారని చెబుతున్నారని కన్నబాబు గుర్తు చేశారు. ఆయన స్కామ్ కథ కంచికి చేరిపోవడంతోనే ఆయన ఆవిధంగా మాట్లాడి ఉంటారని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పిన చంద్రబాబు మాత్రం స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట దోచేశారన్నారు. అమరావతిలో రూ.118 కోట్లు లాగేసిన ముఠాకు, స్కిల్ స్కామ్‌లో ముఠాకు నాయకుడు ఒక్కడేనన్నారు. ఇందులో లోకేష్ పాత్ర కూడా ఉందంటున్నారన్నారు. చంద్రబాబు, కుటుంబ సభ్యులు కూడా ఉండి ఉండవచ్చన్నారు. చంద్రబాబు అరెస్టు దర్యాప్తులో భాగంగా జరిగిన పరిణామమేనని, వైఎస్సార్ సీపీపై బురద జల్లవద్దని హితవు పలికారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

11న ఏఎస్‌డీలో జాబ్‌మేళా



బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జేకేసీ కో–ఆర్డినేటర్ సువర్చల తెలిపారు. నైరోస్ టెక్నాలజీ 44 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని, కంప్యూటర్స్ విభాగంలో ఐటీ లేదా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చని, ఎంపికైన వారికి రూ.2.4 లక్షల వార్షిక వేతనం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు కళాశాలలో సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

ఆక్వా సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం

- విదేశీ ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 40 శాతం
- రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు
- సీఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించిన ఎంపీ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మత్స్య సంపద సృష్టిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో వీటి వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. శనివారం స్థానిక మంజీర కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్స్ సహకారంతో 4వ ఆక్వా– సీఫుడ్ ఫెస్టివల్ రెండో రోజు కార్యక్రమంలో కమిషనర్ కె.కన్నబాబు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కన్నబాబు మాట్లాడుతూ 'ఫిష్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రమోట్ చేసేందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రధాన నగరాల్లో 'సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల ఫెస్టివల్‌లో భాగంగా చేపలు, రొయ్యలు, పీతలతో పాటు ఇతర సముద్ర ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సముద్ర ఉత్పత్తులను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశాలకు సంబంధించి సీఫుడ్ ఫెస్టివల్‌కు హాజరైన రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆక్వా రంగానికి ప్రాధాన్యం: ఎంపీ భరత్‌రామ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మత్స్య ఉత్పత్తులు విదేశాలకు దేశమంతా జరిగే ఎగుమతుల్లో రాష్ట్రం 40 శాతంతో ముందంజలో ఉందన్నారు. ఆక్వా సాగు పెంచి ఆదాయ వనరుగా జీడీపీ వృద్ధి రేటులో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మత్స్య సంపద వినియోగాన్ని పెంచేందుకు రైతులకు అవసరమైన సబ్సిడీ, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు.

ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెంచాలి: జక్కంపూడి

ఏపీలో చేపల ఉత్పత్తి ఎక్కువగా ఉందని, అయితే వాటిపై అవగాహన లేక తక్కువగా వినియోగం జరుగుతున్నట్లు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఇందుకు సంబంధించి దేశీయ మార్కెటింగ్ మరింత అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఆక్వారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్స్, మొబైల్ వాహనాలను ప్రోత్సహించి, రాయితీపై అందించడం ద్వారా ఆయా రంగాలపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు. ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్రా పేరుతో ప్రజలకు ఇప్పటికే మత్స్య సంపదను అందుబాటులోకి తెచ్చామని, ఇందులో భాగంగా చేపలు, రొయ్యల వ్యాపారాభివృద్ధికి మొబైల్ వాహనాలు అందించామన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సముద్రపు ఉత్పత్తుల్లో కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండి ప్రొటీన్లు అత్యధికంగా ఉంటాయని, ఈ ఆహారం నిత్యం తీసుకోవాలన్నారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, ఇళ్ల వెంకటేశ్వరరావు, మత్స్య శాఖ సీఈఓ రామకుమార్, మాజీ సీఈఓ సూర్యమిత్ర, భూమి ఆర్గానిక్స్ సంస్థ ప్రతినిధి రఘురామ్, మెరైన్ జేడీ వీవీ రావు, మత్స్య శాఖ అధికారులు వి.కృష్ణారావు, వీవీ రావు, లాల్ మహమ్మద్, పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

504 మద్యం బాటిళ్ల పట్టివేత

ఇద్దరి అరెస్టు, రూ.30 వేల స్వాధీనం



గోపాలపురంలో నిందితులు, మద్యాన్ని చూపుతున్న పోలీసు అధికారులు

గోపాలపురం: స్థానిక గుడ్డిగూడెం రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 504 మద్యం బాటిళ్లను శుక్రవారం గోపాలపురం పోలీసులు పట్టుకున్నారు. యానాం నుంచి చిన కారులో మద్యాన్ని తరలిస్తుండగా ఎస్‌ఐ సతీష్‌కుమార్, ఆయన సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.1.45 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. కాకినాడకు చెందిన నరుకుల వెంకటేష్, గోపాలపురానికి చెందిన మేకా రమేష్‌లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.30 వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ కొవ్వూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ చెప్పారు. అక్రమ మద్యాన్ని పట్టుకున్న పోలీసులను దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు అభినందించారు.

స్పర్జన్‌రాజుకు అంతిమ వీడ్కోలు



సామర్లకోట రోడ్‌లో డాక్టర్ స్పర్జన్‌రాజు అంతిమయాత్ర

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక రంగరాయ వైద్య కళాశాల పీడీ, జిల్లా ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.స్పర్జన్‌రాజుకు శనివారం రాజకీయ నాయకులు, వివిధ క్రీడా సంఘాల, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కన్నీటి వీడ్కోలు పలికారు. స్థానిక ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీలోని స్పర్జన్‌రాజు ఇంటి నుంచి ఆయన అంతిమ యాత్ర ప్రారంభమైంది. సామర్లకోట రోడ్డు మీదుగా హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి చేరుకుంది. అక్కడ పాస్టర్ విజయ్‌కుమార్ నివాళులు అర్పించారు. ఒలింపిక్ సంఘ మాజీ అధ్యక్షుడు వైడీ రామారావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.సతీష్‌రెడ్డిలు స్పర్జన్‌రాజు భౌతిక కాయానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి అంతిమ యాత్ర మెయిన్ రోడ్, భానుగుడి మీదుగా ఆర్‌ఎంసీ కళాశాలకు చేరుకోగా అక్కడ ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్లు, ఆర్‌ఎంసీ ఆఫీసు సిబ్బంది నివాళులర్పించారు. సంజయ్‌నగర్ క్రైస్తవ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



బాధితులకు చెక్కు అందజేస్తున్న న్యాయమూర్తి గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. తూర్పుగోదారి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్‌ఆర్ జిల్లాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం 44 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు పరిహారం చెల్లిస్తున్నామన్నారు. కొన్ని బీమా కంపెనీలు మోడల్ చెక్కు పంపిణీ చేస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. కేసుల పరిష్కారంలో చొరవ చూపేందుకు ముందుకు వచ్చిన ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయవాదులు, ఇతర శాఖల అధికారులు, తదితరుల భాగస్వామ్యాల సహకారం అభినందనీయమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ ప్రతి ఏడాది నాలుగు సార్లు జాతీయ లోక్‌అదాలత్, మూడు సార్లు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తూ కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా న్యాయమూర్తులు, కోర్టులు పని చేస్తున్నాయన్నారు. రాత్రి 9 గంటల వరకూ 9,125 కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి డి.విజయ గౌతమ్, స్పెషల్ ట్రిబ్యునల్ జడ్జి ఎస్‌పీఈ, ఏసీబీ కోర్ట్ న్యాయమూర్తి యుయు ప్రసాద్, ఒకటో అదనపు సివిల్ జడ్జి ఎస్‌కే జానీబాషా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సి.రమ్య, నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిసుధ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారమైన కీలక కేసులు

సీహెచ్‌వీ రెడ్డి వర్సెస్ శ్రీరామ్ కంపెనీ మధ్య రూ.67 లక్షలకు రాజీ, సి.రామకృష్ణ వర్సెస్ యునైటెడ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.13.75 లక్షలకు రాజీ, బి.మహేష్ వర్సెస్ యునైటెడ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.12.75 లక్షలు, వై.రామకష్ణ వర్సెస్ బజాజ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.11 లక్షలు, సి.రామకృష్ణ వర్సెస్ రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ మధ్య రూ.13 లక్షలు, బి.మహేష్‌కుమార్ వర్సెస్ ఐసీఐసీఐ ఇన్సూరెన్స్ మధ్య 13.75 లక్షలు, జి.సతీష్ కుమార్ వర్సెస్ ఏపీఎస్ ఆర్టీసీ మధ్య రూ.8 లక్షలకు రాజీ ద్వారా పరిష్కారం లభించింది.

మహిళను తోసేసిన టీడీపీ నేత గొల్లపల్లి

సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న వీడియో



మహిళ తలపై టీడీపీ నేత గొల్లపల్లి సూర్యారావు చేయి వేసి తోసివేస్తున్నట్లు వైరల్ అవుతున్న వీడియో చిత్రం

మలికిపురం: మాజీ మంత్రి, టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు మహిళను తోసివేస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. టీడీపీ నేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర దిండి వంతెన వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి శుక్రవారం ప్రవేశించింది. ఆ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పాదయాత్రకు స్వాగతం పలికారు. మలికిపురం, రాజోలు మండలాలకు చెందిన ఆ పార్టీ మహిళా నాయకులు కొంతమంది ఫొటోల కోసం ఎగబడ్డారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు రాజోలుకు చెందిన ఒక మహిళా నాయకురాలి తలపై చెయ్యి వేసి తోసేసినట్టు ఈ వీడియోలో ఉంది. గొల్లపల్లి తీరుపై పలువురు నాయకులు విమర్శలు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి రైలు కిందపడి శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపారు. సామర్లకోటలో అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఎదురుగా పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకొన్న వ్యక్తిని రైల్వే కీమెన్ గుర్తించాడు. దీనిపై రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని వద్ద లభించిన ఆధారాల మేరకు రంగంపేట మండలం కె.కోటపాడుకు చెందిన మిరియాల లోవయ్య (42)గా గుర్తించారు. వీరనాట్యం వృత్తితో జీవించే లోవయ్య మూడేళ్ల నుంచి అనారోగ్యానికి గురికావడం, టీబీ వ్యాధి పిల్లలకు వ్యాపిస్తుందని ఇంటి నుంచి వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, ఎస్సై లోవరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలో 216 జాతీయ రహదారి చెంతన ఉన్న షిర్డీసాయి మందిరం వెనుక వీధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటిన జరిగిన ఈ ఘటనలో రూ.రెండు లక్షల విలువైన ఏడు కాసుల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నారు. పేరాబత్తుల రాధాకృష్ణ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంటికి వెళ్లారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి శనివారం తెలిపారు.